క్లుప్తంగా

నాటుసారా అనర్థాలపై అవగాహన



వినుకొండ: మండలంలోని అందుగుల కొత్త పాలెంలోని బీసీ కాలనీలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్‌శాఖ ఆధ్వర్యంలో నాటుసారాయి తాగడం వల్ల జరిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ సీఐ శ్రీనివాసరావు నాటుసారాయి, కల్తీ లిక్కరు ప్రాణాంతకమని తెలిపారు. వినుకొండ సర్కిల్ పరిధిలో గత మూడు సంవత్సరాలుగా ఎక్కడా నాటుసారా కేసులు నమోదు కాలేదని తెలిపారు. అనంతరం అనుమానిత ప్రాంతాలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

మెగా జాబ్ మేళాలో 95 మంది ఉద్యోగావకాశాలు



వినుకొండ: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళ నిర్వహించారు. ఈ జాబ్ మేళాలో 10 కంపెనీలు హాజరు కాగా 234 మందికి ఇంటర్వ్యూలు నిర్వహించి 95 మందికి ఉద్యోగాలకు ఎంపిక చేసినట్లు పల్నాడు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఈ. తమ్మాజీరావు తెలిపారు. ఈ జాబ్ మేళాకు ముఖ్య అతిథిగా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ మెగా జాబ్‌మేళా నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యోగ కల్పనా అధికారి ఎం. రవీంద్రనాయక్, స్కిల్ హబ్ కో ఆర్డినేటర్ డి. జానీబాషా, సురేష్, శ్రీకాంత్, రామకృష్ణ రెడ్డి, రమ్య, కంపెనీ హెచ్‌ఆర్ ప్రతినిధులు, కళాశాల సిబ్బంది శివ ఫణీంద్ర పాల్గొన్నారు.

విద్యార్థినికి ఆర్థిక సాయం



యడ్లపాడు: ప్రతిభావంతురాలైన విద్యార్థినికి పలువురు ఆర్థిక సహాయం అందజేశారు. మండలంలోని వంకాయలపాడు గ్రామానికి చెందిన షేక్ ఆయేషా విద్యలో రాణిస్తోంది. అయితే తల్లి అనారోగ్యంతో పాటు ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్న నేపథ్యంలో ఉన్న ఆయేషాను పూర్వ విద్యార్థులు రూ.12,500 సాయం అందించారు. మోదుగుల వాసుదేవరెడ్డి రూ.10,116, పి.మల్లి ప్రసాద్ రూ.వెయ్యి, శ్రీనివాసరావు రూ.1,340 ఇంటికి వెళ్లి అందజేశారు. దీంతో ఆయేషా, తల్లి దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.

బహుళజాతి సంస్థలో 102 మందికి ఉద్యోగాలు



నరసరావుపేట రూరల్: ప్రముఖ బహుళజాతి సంస్థ సావన్‌టిస్ సొల్యూషన్స్ నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 102 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్టు నరసరావుపేట ఇంజినీరింగ్ కళాశాల వైస్‌చైర్మన్ మిట్టపల్లి చక్రవర్తి శనివారం తెలిపారు. ఈనెల 18న కళాశాలలో నిర్వహించిన ఇంటర్వ్యూలలో సంస్థ ప్రతినిధులు విద్యార్థులకు పలు రౌండ్‌లలో పరీక్షలు నిర్వహించి ఉద్యోగాలకు ఎంపిక చేశారని తెలిపారు. రూ.3 లక్షల వార్షిక వేతనంతో కూడిన ట్రైనీ ఎనలిస్ట్ ఉద్యోగాలకు బీటెక్, ఎంసీఏ విద్యార్థులు ఎంపికయ్యారని వివరించారు. ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను కళాశాల చైర్మన్ మిట్టపల్లి వెంకట కోటేశ్వరరావు, కళాశాల కార్యదర్శి మిట్టపల్లి రమేష్ బాబు ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ టి.ఉమాశంకర్, ఏవో శ్రీధర్, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు అభినందించారు.

చలో విజయవాడను జయప్రదం చేయండి



నరసరావుపేట ఈస్ట్: విద్యుత్ ఉద్యోగుల, కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 21వ తేదీన చేపట్టిన చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఏపీ ఎలక్ట్రిసిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ పల్నాడు జిల్లా గౌరవ అధ్యక్షుడు కాసా రాంబాబు తెలిపారు. ఈమేరకు ఛలో విజయవాడ పోస్టర్‌ను శనివారం ఏఐటీయూసీ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈసందర్భంగా రాంబాబు మాట్లాడుతూ విద్యుత్ ఉద్యోగులు, కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ కార్య నిర్వాహక అధ్యక్షుడు ఉప్పలపాటి రంగయ్య, జిల్లా అధ్యక్షుడు ఎస్.ప్రసన్న కుమార్, పి.వి.రాయుడు పాల్గొన్నారు.

షూ్యరిటీకి.. మోసాలకు గ్యారంటీ చంద్రబాబు

- ఆయనకు సాటి మరెవ్వరూ లేరు
- జిల్లా వైఎస్సార్ సీపీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి
- రొంపిచర్లలో పార్టీ విస్తృత స్థాయి సమావేశం



మాట్లాడుతున్న డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి

రొంపిచర్ల: అబద్ధాలు చెప్పి ప్రజలను మోసం చేయడంలో చంద్రబాబు సాటి మరెవ్వరూ లేరని జిల్లా వైఎస్సార్ సీపీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. స్థానిక శ్రీ అంకమ్మ దేవాలయ ఆవరణలో శనివారం నిర్వహించిన విస్తృతస్థాయి సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బాబు షూ్యరిటీ ఇచ్చి మోసం చేయటం ఇది రెండవ సారి అన్నారు. 2014లో రైతులను మోసం చేసిన ఘనత చంద్రబాబుదే అన్నారు. రైతులకు, డ్వాక్రా మహిళలకు రుణ మాఫీ చేస్తానని మోసం చేశాడన్నారు.

చంద్రబాబులో మార్పు వచ్చిందేమోనని మళ్లీ 2024లో సూపర్ సిక్స్ పథకాలను చూసి ఓట్లు వేస్తే మరోసారి మోసం చేశారన్నారు. తల్లికి వందనం మొదటి సంవత్సరం ఎగ్గొట్టాడన్నారు. జగన్ మోహన్ రెడ్డి వెన్నుపోటు దినోత్సవం పేరుతో రోడ్డు మీదకు వస్తే బయపడి ఆ పథకాన్ని అరకొరగా అమలు చేశారన్నారు. మరో 30 లక్షల మందికి ఈ పథకాన్ని ఎగ్గొటడన్నారు. మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి బయటకు వస్తే బాబు, ఆయన తనయుడు భయపడుతున్నారన్నారు. రైతుల కోసం బంగారుపాళ్యం వెళ్లిన తర్వాతనే మామిడి రైతుల కోసం రూ.250 కోట్లు విడుదల చేసిందన్నారు. అలాగే పొదిలి వెళ్లిన తర్వాతనే కొత్తగా పొగాకు కొనుగోలు కేంద్రాలు ప్రారంభించిందన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ఐదు ఏళ్లపాటు రాష్ట్రంలో అమ్మఒడి పథకాన్ని అమలు చేస్తే దాని పేరు మార్చి ఈ పథకం లోకేష్ తల్లికి వందనంగా పేరు మార్చి మోసం చేశారన్నారు. కావలి ఎమ్మెల్యే కృష్ణారెడ్డి తన నియోజకవర్గంలో ఒకే పాఠశాల్లో 50 మంది పిల్లలకు ఈ పథకం ఇవ్వలేదని బహిరంగంగా చెప్పడాన్ని ఆయన గుర్తుకు తెచ్చారు. రాష్ట్రంలో 30 లక్షల మంది విద్యార్థులకు ఈ పథకం ఎగ్గొట్టారన్నారు. రొంపిచర్ల మండలంలో గత ఐదు ఏళ్లల్లో రూ.112 కోట్ల రూపాయలతో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేశామన్నారు.

పింఛన్, రేషన్ కార్డు, ఇంటి స్థలం ఒక్కటీ ఇవ్వలేదు!

బాబు గవర్నమెంట్ వచ్చిన తర్వాత ఎక్కడైనా ఒక్క పెన్షన్, రేషన్ కార్డు, ఇంటి స్థలం ఇచ్చిన దాఖలాలు ఉన్నాయని ఎద్దేవా చేశారు. మండలంలో రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తుందన్నారు. కొత్తపల్లి సర్పంచ్ కోటేశ్వరరావు, ఎడ్వర్డ్‌పేటలో 9 మందిపై అనవసర కేసులు పెట్టడంతో పాటు తురిమెళ్ల గ్రామానికి చెందిన మరో ఆరుగురిని ఎలాంటి తప్పు లేకుండా వారం రోజుల పాటు స్టేషన్‌లో బంధించారన్నారు. తప్పులు చేసిన వారిని వదిలేది లేదన్నారు. గ్రీన్ బుక్, రెడ్‌బుక్ రాస్తామన్నారు. రెడ్‌బుక్‌లో చేసిన తప్పులు, గ్రీన్ బుక్‌లో జెండాలు మోసిన కార్యకర్తల పేర్లు ఉంటాయన్నారు. రెడ్‌బుక్ పాలనలో ఎన్నికేసులు పెట్టినా భయపడేది లేదన్నారు. బాబు షూ్యరిటీ మోసం గ్యారెంటీపై గ్రామాల్లో ఇంటింటికి తిరిగి ప్రచారం చేయాలని పిలుపునిచ్చారు. షెడ్యూల్ ప్రకారం గ్రామాల్లో బాబు మోసాలపై ప్రచారం చేయనున్నట్లు తెలిపారు. రేపు మన ప్రభుత్వం వచ్చాక మేము 2.0 ఎలా ఉంటుందో చూపిస్తామన్నారు. కార్యక్రమానికి ముందుగా చెరువుగట్టు సెంటర్‌లోని వైఎస్సార్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూల మాలలు వేసి నివాళి అర్పించారు. దేవాలయాల్లో పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల పార్టీ అధ్యక్షుడు కురుగుంట శ్రీనివాసరెడ్డి అధ్యక్షత వహించగా, నాయకులు పడాల చక్రారెడ్డి, అన్నెం పున్నారెడ్డి, పచ్చవ రవీంద్రబాబు, గెల్లి చిన్న కోటిరెడ్డి, పడాల శివారెడ్డి, పల్లెల మల్లిఖార్జునరెడ్డి, ముంద్రు హరినారాయణ, గడ్డం వెంకట్రావు, గుండాల వెంకటేష్, కరీం, జిడ్డు ఎర్రయ్య, మోతుకూరి వెంకటేష్, రంగారెడ్డి, పల్లపు అంజయ్య, ఎంపీటీసీ శ్రీనివాసరావు, ఆకాష్ కుమార్, కంచేటి రామారావు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకులవి అసందర్భ ప్రేలాపనలు

చిలకలూరిపేట వైఎస్సార్ సీపీ నాయకుల ధ్వజం



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

చిలకలూరిపేట: టీడీపీ ద్వితీయ శ్రేణి నాయకులవి స్థాయికి మించిన ప్రేలాపనలని వైఎస్సార్ సీపీ నాయకులు ధ్వజమెత్తారు. విమర్శకు ప్రతి విమర్శ చేసేటప్పుడు వారిస్థాయి గుర్తుంచుకోవాలని సూచించారు. పట్టణంలోని ఎన్‌ఆర్‌టీ రోడ్డులో ఉన్న మాజీ మంత్రి విడదల రజిని నివాసంలో శనివారం వైఎస్సార్ సీపీ నాయకులు విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 17వ తేదీన బాబు షూ్యరిటీ-మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించామని తెలిపారు. ఈ సందర్భంగా గత ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధి, ప్రజలకు జరిగిన మేలు గురించి మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు వివరించటం జరిగిందన్నారు.

అదే క్రమంలో ఏడాదిగా టీడీపీ పాలనలో ప్రజలకు జరిగిన మోసాన్ని బాధ్యతగల ప్రతిపక్షంగా విమర్శించటం జరిగిందన్నారు. దీనికి సంబంధించి వారిస్థాయి ఏమిటో వారికి కూడా తెలియని వారితో టీడీపీ అధినాయకత్వం విలేకర్ల సమావేశం ఏర్పాటు చేసి స్థాయి మరిచి విమర్శలకు పాల్పడటం నీచ దాయకమన్నారు. 100 పడకల ప్రభుత్వాసుపత్రి నిర్మాణంతో పాటు ఆసుపత్రి చుట్టూ రిటైనింగ్ వాల్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయించి ఎప్పుడో మాజీ మంత్రి విడదల రజిని శంకుస్థాపన చేశారని వివరించారు. ఇప్పుడు తిరిగి రిటైనింగ్ వాల్ పనులకు శంకుస్థాపన స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు చేయడం హాస్యాస్పదమన్నారు.

చిలకలూరిపేటకు బైపాస్ నిర్మాణం కేంద్ర పరిధిలో ఉంటుందని టీడీపీ వారికి తెలియకపోవడం శోచనీయమన్నారు. బైపాస్ నిర్మాణం కేంద్ర ప్రభుత్వం చేపడితే, నిర్మాణానికి అవసరమైన భూసేకరణ జగనన్న ప్రభుత్వంలో మాజీ మంత్రి విడదల రజిని ఆధ్వర్యంలో చేసి రైతులకు రూ.250 కోట్లు పరిహారంగా చెల్లించి పనులు పూర్తి చేయడం జరిగిందన్నారు. కరోనా కారణంగా పనుల్లో కొంత జాప్యం జరగడం, పనులు పూర్తి అయ్యేనాటికి ఎన్నికల కోడ్ రావడంతో బైపాస్ రోడ్డు ప్రారంభానికి ఆలస్యం జరిగిందన్నారు. బైపాస్ కూడా తమ హయాంలో జరిగినట్లు చెప్పుకోవడం టీడీపీ నాయకుల దిగజారుడుతనానికి నిదర్శమన్నారు. వైఎస్సార్ సీపీ టికెట్‌పై గెలిచి టీడీపీలోకి ఫిరాయించిన పదో వార్డు కౌన్సిలర్ బేరింగ్ మౌలాలి లాంటి వాళ్లు మాజీ సీఎం వైఎస్ జగన్, మాజీ మంత్రి విడదల రజినిని విమర్శించే స్థాయి కాదన్నారు. గత ప్రభుత్వంలో జరిగిన మంచిని తమ ప్రభుత్వంలో జరిగినట్లు చెప్పుకోవడం కాదని వీలైతే ప్రజలకు గట్టిమేలు చేసి చెప్పుకోవాలని హితవు పలికారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు షేక్ దరియావలి, చిలకలూరిపేట ఎంపీపీ దేవినేని శంకరరావు, యడ్లపాడు మండల పార్టీ అధ్యక్షుడు వడ్డేపల్లి నరసింహారావు, నియోజకవర్గ మహిళా విభాగం అధ్యక్షురాలు ఏకాంబరపు సునీత, పార్టీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు కందుల శ్రీకాంత్, నియోజకవర్గ అధ్యక్షుడు కుప్పాల ప్రభుదాస్ నాయుడు, జిల్లా నాయకులు సింగారెడ్డి కోటిరెడ్డి, మద్దూరి కోటిరెడ్డి, సయ్యద్ జమీర్, గోపతోటి జాన్, తాళ్ల అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు రక్షణ చట్టం తీసుకురావాలి

ఏపీ బీసీ సంక్షేమ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు

నరసరావుపేట: రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ఎన్నికల వాగ్దానం మేరకు బీసీలకు రక్షణ చట్టం తేవాలని, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వెంటనే కల్పించాలని ఏపీ బీసీ సంక్షేమ సంఘ రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు కోరారు. శనివారం మున్సిపల్ అతిథి గృహంలో మీడియాతో మాట్లాడారు. జనగణనలో సమగ్ర కులగణనను కేంద్రం చేపడుతున్నందున ముందుగా విధివిధానాలు బహిర్గతంచేసి జాతీయస్థాయిలో జనగణన అనంతరం ఎస్సీ-ఎస్టీల మాదిరిగానే ఓబీసీలకు కూడా జనాభా దామాషా మేరకు రిజర్వేషన్లు పెంచాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు. స్థానిక సంస్థలలో 34 శాతం, చట్టసభలలో 33 శాతం బీసీలకు రిజర్వేషన్ ఇచ్చేలా కూటమి సర్కారు ఎన్నికల వాగ్దానం చేసిందన్నారు. కులగణన తర్వాత మాత్రం జనాభా దామాషా మేరకు రిజర్వేషన్లు పెంచేలా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కృషిచేయాలని కోరారు. రాష్ట్ర అధికార ప్రతినిధి బాదుగున్నల శ్రీను, పట్టణ అధ్యక్షుడు కొల్లిపర బాలాజీ, యువజన అధ్యక్షులు సుతారం విశ్వేశ్వరరావు, రొంపిచెర్ల మండల అధ్యక్షులు గాలి సాంబశివరావు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

అలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం

నరసరావుపేట రూరల్: ఇస్సపాలెంలోని మహంకాళి అమ్మవారి ఆలయ నిర్మాణానికి నరసరావుపేటకుచెందిన బొలిశెట్టి వెంకట సుబ్బారావు రూ.లక్ష విరాళంగా అందజేశారు. ఆలయ కార్యాలయంలో ఈవో నలబోతు మాధవిదేవిని కలిసి విరాళం చెక్‌ను దాతలు అందించారు. కార్యక్రమంలో అలయ అర్చకుడు కొత్తలంక కార్తికేయ శర్మ తదితరులు పాల్గొన్నారు.

పేదల హక్కుల పరిరక్షణ కోసం పోరాడాలి

చిలకలూరిపేట: పేదల హక్కుల పరిరక్షణ కోసం పోరాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎ మారుతీ వరప్రసాద్ చెప్పారు. మండలంలోని వేలూరు గ్రామంలో సీపీఐ 20వ గ్రామ మహాసభను శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ సమాజంలో నెలకొన్న అసమానతలను రూపుమాపేందుకు కమ్యూనిస్టు పార్టీ పోరాడుతోందన్నారు. సీపీఐ ఏరియా ఇన్‌చార్జి కార్యదర్శి తాళ్లూరి బాబురావు, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి షేక్ సుభాని, నాయకులు దాసరి వరహాలు, గ్రామ సర్పంచ్ తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారికి సారె సమర్పణ

రొంపిచర్ల: మండలంలోని గోగులపాడు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీదేవి భూదేవి సహిత కళ్యాణ వెంకటేశ్వరస్వామి దేవాలయంలో అమ్మవారికి శనివారం భక్తులు ఆషాఢమాస సారెను అందజేశారు. ప్రధాన అర్చకులు ప్రసాద్‌శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి పసుపు, కుంకుమ, గాజులు, చీరలు, చలివిడితో పాటు ప్రత్యేక నైవేద్యాలను ఊరేగింపుగా తీసుకువచ్చి సమర్పించారు.

యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ నూతన కార్యవర్గం ఎన్నిక

నరసరావుపేట: యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్, నరసరావుపేట నూతన కార్యవర్గాన్ని శనివారం కోటప్పకొండరోడ్డులోని చర్చి ఆఫ్ క్రీస్తు చర్చిలో ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా కె.ఆర్‌సీ రావు, ఉపాధ్యక్షులుగా టి.ప్రేమ్‌కుమార్, కార్యదర్శిగా ఎం.రాజారావు, సంయుక్త కార్యదర్శిగా డి.వసంతరావు, కోశాధికారిగా జి.జాన్‌బాబు, ఉప కోశాధికారిగా జి.విజయకుమార్‌లను ఎన్నుకున్నారు. వీరితో పాటు మరో ఐదుగురిని మెంబర్లుగా ఎన్నుకున్నారు. డాక్టర్ అబ్రహం, డాక్టర్ సీహెచ్. ఫ్రాన్సిస్ అడ్వయిజర్లుగా నియమించారు.

దేవాలయ భూముల కౌలు వేలం

రొంపిచర్ల: స్థానిక శ్రీ వేణుగోపాల స్వామి, శ్రీ శంకర స్వామి దేవాలయాల మాన్యం భూములకు శనివారం కౌలు వేలం నిర్వహించారు. ఈ వేలంలో వేణుగోపాలస్వామి దేవాలయానికి సంబంధించిన 9 ఎకరాల పంట భూమికి రూ.55 వేల రూపాయల కౌలుకు రైతులు పాడుకున్నారు. అలాగే శ్రీ శంకర స్వామి మాణ్యం భూముల వేలం పాటను వాయిదా వేస్తున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ పుణ్యాల వెంకటేశ్వర్లు ప్రకటించారు.

సాధనా సామర్థ్యాలతో ఉత్తమ ఫలితాలు

డీఈవో చంద్రకళ

నాదెండ్ల: విద్యార్థులకు సాధనా సామర్థ్యాల ద్వారా అర్థమయ్యే రీతిలో పాఠాలు బోధించి ఉత్తమ ఫలితాల సాధనకు ఉపాధ్యాయులు కృషి చేయాలని డీఈవో చంద్రకళ చెప్పారు. మండలంలో ఐదు క్లస్టర్లు గణపవరం, నాదెండ్ల, సాతులూరు, చిరుమామిళ్ళ, ఎండుగుంపాలెంలలో కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహించారు. శనివారం సాతులూరులో జరిగిన కాంప్లెక్స్ సమావేశంలో డీఈవో చంద్రకళ హాజరై ఉపాధ్యాయులకు సామర్థ్యాలపై తగు సూచనలు చేశారు. మధ్యాహ్నం ఒంటి గంట నుండి సాయంత్రం ఐదు గంటల వరకూ జరిగిన సమావేశాల్లో ఆయన పాల్గొన్నారు. నాదెండ్లలో జరిగిన కాంప్లెక్స్ సమావేశాల్లో ఎంఈవో కృష్ణారెడ్డితో పాటూ ఆయా పాఠశాలల హెచ్ఎంలు పాల్గొన్నారు. మండలంలో జిల్లా పరిషత్, ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఏపీ మోడల్ పాఠశాల, కేజీబీవీ పాఠశాలల్లో జరిగాయి.

ముగిసిన చేతిరాత శిక్షణ తరగతులు



చిలకలూరిపేటటౌన్: పట్టణంలోని సుబ్బయ్య తోటలోని వికాస్ విద్యాసంస్థలో ప్రముఖ క్యాలిగ్రఫీ నిపుణులు వై.మల్లికార్జునరావు ఆధ్వర్యంలో రెండు రోజులు నిర్వహించిన ప్రత్యేక కర్సివ్ హ్యాండ్ రైటింగ్ వర్క్‌షాప్ శనివారం ముగిసింది. 6 నుండి 10వ తరగతి వరకు విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్న ఈ కార్యక్రమంలో, అక్షరాల మధ్య బంధాన్ని నిర్మించి రాయడం వల్ల సమయాన్ని ఎలా ఆదా చేసుకోవచ్చో విద్యార్థులకు వివరించారు. చేతివ్రాత క్రమబద్ధత విద్యార్థుల్లో అంకితభావాన్ని పెంపొందించడానికి కీలకమని తెలిపారు. విద్యార్థుల మౌలిక నైపుణ్యాల పెంపు కోసం వివిధ రంగాల్లో నిపుణులతో తరచూ శిక్షణా కార్యక్రమాలు చేపడుతున్నామని వికాస్ డైరెక్టర్లు దండా పవన్ కుమార్, రోజశ్రీలు తెలిపారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్స్ కల్పన, శ్యాంబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మూడుచోట్ల క్లస్టర్ సమావేశాలు

రొంపిచర్ల: మండలంలోని రొంపిచర్ల, సంతగుడిపాడు, జెడ్పీహెచ్ హైస్కూల్‌ల్లో వి.రెడ్డిపాలెం మోడల్ స్కూల్‌లో శనివారం క్లస్టర్ సమావేశాలు నిర్వహించారు. జూలై నెలలో పూర్తి చేయాల్సిన సిలబస్‌పై తరగతుల వారీగా సమీక్షించారు. విద్యాబోధన చేయడంలో మెళుకువలు, విద్యార్థులను అన్ని విషయాల్లో చురుకుగా ఉంచడంలో పాటించవలసిన జాగ్రత్తలు, పాఠశాలల్లో వసతులు, అభివృద్ధి, పారిశుద్ధ్యంపై చర్చించారు. ఈ కార్యక్రమాలను ఎంఈవో డి. బ్రహ్మేశ్వరరావు పర్యవేక్షించారు.

సమ్మె కాలపు ఒప్పందాలపై జీఓలు జారీ చేయండి



మానవహారంగా ఏర్పడి నినాదాలు చేస్తున్న నాయకులు, కార్మికులు



కార్మికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు

- మానవహారంగా ఏర్పడి నిరసన తెలియ చేసిన మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు
- సమ్మె శిబిరాన్ని సందర్శించిన ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ
- సంఘీభావం తెలియచేసి పోరాటం విజయవంతం కావాలని ఆకాంక్ష

నరసరావుపేట: గత 17 రోజుల సమ్మె కాలపు ఒప్పందాలకు తగిన జీఓలు జారీ చేయాలని సీఐటీయూ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తమ జీతాలు పెంచాలని, సంక్షేమపథకాలు అమలు చేయాలని కోరుతూ మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు చేస్తున్న సమ్మె శనివారంతో ఏడో రోజుకు చేరింది. తమ సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవాలని కోరుతూ ఇంజినీరింగ్ కార్మికులు గడియారం స్తంభం సెంటర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం చుట్టూ మానవహారం నిర్వహించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కాగా, సమ్మె శిబిరాన్ని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు సందర్శించి కార్మికుల సమ్మెకు తన సంఘీభావం తెలియచేశారు. మీ పోరాట విజయవంతం కావాలని ఆకాంక్షించారు. మీ డిమాండ్లు ప్రభుత్వానికి తెలియచేశానని, వచ్చే రెండు మూడు రోజుల్లో జీతాలు పెంచుతూ నిర్ణయాలు వెలువడే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. సీఐటీయూ నాయకులు షేక్ సిలార్, చిన్న అల్లాభక్షు, మార్కెట్ యార్డు చైర్మన్ పూనాటి శ్రీనివాసరావు, బాదుగున్నల శ్రీను, కార్మికులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిలో ఆక్రమణలు తొలగిస్తాం

తహసీల్దార్ రమేష్‌కుమార్



గ్రామస్తులతో మాట్లాడుతున్న తహసీల్దార్

నూజెండ్ల: మండల పరిధిలోని ఐనవోలు పంచాయితీ యోగిరెడ్డిపాలెం గ్రామంలో వివాదాస్పద భూమిని తహసీల్దార్ రమేష్ కుమార్ శనివారం పరిశీలించారు. గ్రామంలోని ఉన్న కుంట పోరంబోకు భూమిని సర్వే చేసి ఆక్రమణలు తొలగించాలని తహసీల్దార్‌కు ఇటీవల గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు తహసీల్దార్ ఆదేశాలతో సర్వేయర్ చండీరాణి భూమిని సర్వే చేసి సర్వే నెం 105 ఎ లో 3.15 సెంట్లు కుంట పోరంబోకుగా తేల్చారు. మిగిలిన 105 1బి లో 87 సెంట్లు వేరొకరి ఆధీనంలో ఉందని నిర్ధారించారు. కుంట పోరంబోకు భూమి సబ్ డివిజన్ జరగలేదని తప్పుడు ధ్రువీకరణ పత్రాలు సృష్టించి ఆక్రమణలు చేశారని గ్రామస్తులు వివరించారు. సమగ్ర విచారణ చేసి చర్యలు చేపడతామని తహసీల్దార్ గ్రామస్తులకు హామీ ఇచ్చారు.

ప్లాస్టిక్ అంతానికి ముందడుగు వేయాలి



ఎస్ ఎస్ అండ్ ఎన్ కళాశాలలో ప్రతిజ్ఞ చేస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

ఎమ్మెల్యే, చీఫ్‌విప్ జీవీ అంజనేయులు

నూజెండ్ల: పర్యావరణ పరిరక్షణకు ప్రజలంతా నడుం బిగించాలని, ప్లాస్టిక్ అంతానికి ముందడుగు వేయాలని ఎమ్మెల్యే, చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు పిలుపునిచ్చారు. మండల కేంద్రమైన నూజెండ్లలో శనివారం సుపరిపాలనలో తొలి అడుగు-ఇంటింటికీ ప్రచారం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో ఉమాదేవి పర్యవేక్షణలో నిర్వహించిన స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణ ఆంధ్రలో భాగంగా ప్లాస్టిక్ కాలుష్యానికి అంతం ప్రచార కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈవో రవిచంద్ర, డీఎల్‌డీఏ చైర్మన్ లగడపాటి వెంకట్రావు, సొసైటీ అధ్యక్షులు బచ్చు అంజిరెడ్డి, గంగినేని ఆంజనేయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలి

వినుకొండ: స్వర్ణాంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా పట్టణంలో ప్లాస్టిక్ వినియోగానికి స్వస్తి పలికి పర్యావరణాన్ని కాపాడుకోవాలంటూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ 120 మైక్రాన్‌ల కంటే తక్కువ మందం గల ప్లాస్టిక్ కవర్లు, కప్పులు, ఇతర ప్లాస్టిక్ వస్తువుల వాడకం మన ఆరోగ్యానికి పర్యావరణానికి ఎంతో ప్రమాదకరమన్నారు. తదుపరి పాఠశాల నుండి లాయర్‌స్ట్రీట్, పల్నాడు రోడ్డు మీదుగా పట్టణంలో ప్లాస్టిక్ నిర్మూలనపై ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ డాక్టర్ దస్తగిరి సతీమణి కౌన్సిలర్ షేక్ షకీలా, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఇస్మాయిల్, హెచ్‌ఎం శైలజ, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

కళాశాలల్లో ప్లాస్టిక్ నివారణపై అవగాహన

నరసరావుపేట ఈస్ట్: ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని శ్రీసుబ్బరాయ అండ్ నారాయణ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.ఎస్.సుధీర్ తెలిపారు. స్వచ్ఛంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగాల ఆధ్వర్యంలో ప్లాస్టిక్ నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ప్రిన్సిపల్ డాక్టర్ సుధీర్ మాట్లాడుతూ, ప్లాస్టిక్ వినియోగం వలన కలిగే అనర్థాలను వివరించారు. ఈసందర్భంగా స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో వైస్‌ప్రిన్సిపల్ డాక్టర్ పి.శ్రీనివాససాయి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు టి.వి.శంకరరెడ్డి, డాక్టర్ ఏ.సరళాదేవి, డాక్టర్ రాజనాల వేణుమాధవ్, పి.శ్రీనివాసులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

కృష్ణవేణి డిగ్రీ కళాశాలలో శనివారం సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సుకు గుంటూరు రీజనల్ కాలుష్య నియంత్రణ మండలి కాలుష్య విభాగం ఎనలిస్ట్ ఎడ్లపల్లి అనిల్‌కుమార్ హాజరై ప్లాస్టిక్ వినియోగం వలన కలిగే అనర్థాలను వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ నాతాని వెంకటేశ్వర్లు, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ డి.యోగేశ్వరరావు, ఎం.బాలకోటేశ్వర రావు, తిరుపతిరావు పాల్గొన్నారు.

ప్లాస్టిక్‌ను వాడొద్దు..

యడ్లపాడు: పర్యావరణానికి, ఆరోగ్య పరమైన సమస్యలకు మూలమైన సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను బైబై చెప్పాలని ఎంపీడీవో వి.హేమలతాదేవి చెప్పారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్లాస్టిక్ నిషేధంపై అన్ని గ్రామ పంచాయతీల్లో శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. మండలంలోని జగ్గాపురం గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీడీవో, డిప్యూటీ ఎంపీడీవో షేక్ జాకీర్ హుస్సేన్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అనంతరం సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకాన్ని స్వచ్ఛందంగా మానివేస్తామంటూ ప్రతిజ్ఞ చేశారు.

ఎన్‌సీసీ క్యాడెట్స్ ఆధ్వర్యంలో

నరసరావుపేట రూరల్: ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి ప్లాస్టిక్ కాలుష్యాన్ని నివారిద్దామని ఎన్‌సీసీ క్యాడెట్స్ నినదించారు. స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా నరసరావుపేట ఇంజనీరింగ్ కళాశాల ఎన్‌సీసీ క్యాడెట్స్ ఆధ్వర్యంలో పట్టణంలో ప్లాస్టిక్ నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. 23వ ఆంధ్ర బెటాలియన్ పర్యవేక్షణలో 100 మంది ఎన్‌సీసీ క్యాడెట్స్ ర్యాలీలో పాల్గొన్నారు. బస్టాండ్ సెంటర్ నుంచి కోట సెంటర్ వరకు నిర్వహించిన ర్యాలీలో ప్లాస్టిక్ వాడకం వలన పర్యావరణానికి కలిగే నష్టాలు, పరిష్కార మార్గాలపై నినాదాలు చేస్తూ అవగాహన కల్పించారు. కోట సెంటర్‌లోని మహాత్మాగాంధీ విగ్రహం వద్ద మానవహారంగా ఏర్పడి ప్లాస్టిక్ వ్యర్థాల నివారణ చర్యలను తెలియజేశారు. కార్యక్రమంలో కళాశాల ఎన్‌సీసీ అధికారి లెఫ్టినెంట్‌రాజేష్‌బాబు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రజలు సహకరించాలి

చిలకలూరిపేట: పారిశుద్ధ్యం మెరుగుకు ప్రజలు సహకరించాలని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు చెప్పారు. పట్టణంలో స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా ర్యాలీని శనివారం నిర్వహించారు. చెత్త సేకరణ నిమిత్తం రూ. 4లక్షలతో కొనుగోలు చేసిన పుష్‌కార్ట్స్, డస్ట్‌బిన్‌లను మున్సిపల్ సిబ్బందికి అందించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, కమిషనర్ పి.శ్రీహరిబాబు తదితరులు పాల్గొన్నారు.

సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌తో చేటు

నాదెండ్ల: నిత్య జీవితంలో రోజువారీ వినియోగించే సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకాన్ని స్వచ్ఛందంగా వదిలివేయాలని తహసీల్దార్ ఎస్.చంద్రశేఖర్ చెప్పారు. ప్రతినెలా మూడో శనివారం నిర్వహించే స్వచ్ఛాంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమం నాదెండ్ల తహసీల్దార్ కార్యాలయం వద్ద నిర్వహించారు.

రహదారిపై విరిగిపడ్డ వటవృక్షం



నాదెండ్ల: భారీ వర్షానికి వటవృక్షం విరిగి ఆటోపై పడిన సంఘటన సాతులూరు గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. గుంటూరు-కర్నూలు జాతీయ రహదారిపై జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎదురుగా ఉన్న చెరువు కట్ట వద్ద ఉన్న భారీ వృక్షం వర్షం కురుస్తున్న సమయంలో విరిగి రహదారిపై వెళ్తున్న ఆటోపై పడింది. ఈ ప్రమాదంలో ఆటో ధ్వంసం కాగా ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు. కరెంటు తీగలపై చెట్టు కొమ్మలు పడటంతో స్తంభాలు విరిగిపడ్డాయి. ట్రాఫిక్ స్తంభించింది. పంచాయతీ అధికారులు ప్రొక్లెయినర్‌తో చెట్టు తొలగించి ట్రాఫిక్ క్లియర్ చేసి విద్యుత్ తీగలు పునరుద్ధరించారు.